నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, సోమవారం 22 జనవరి 2024 | NIRMAL

## దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తా..

- ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

తానూర్, జనవరి 21 : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఆదివారం ఎల్వత్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, మండల విద్యాధికారి సుభాష్, పంచాయత్ రాజ్ ఏఈ జగదీష్, ఎంపీవో మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

## వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న దంపతులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 21 : ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కన్యక పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా 102 జంటలు సామూహిక వ్రతంలో పాల్గొన్నాయి. మహాప్రసాద వితరణను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కర సేవలో ముథోల్‌వాసులు



కర సేవలో పాల్గొన్న ముథోల్ ప్రాంతవాసులు

ముథోల్, జనవరి 21 : మూడు దశాబ్దాల క్రితం అయోధ్యలో తలపెట్టిన కరసేవకు ముథోల్ ఉమ్మడి మండలంలోని బాసర, ఆష్టా, ముథోల్ గ్రామాల నుంచి 12 మంది కర సేవకులు తరలివెళ్లారు. ఇందులో ముథోల్ మండలంలోని ఆష్టా గ్రామానికి చెందిన అశోక్‌జాదవ్, సుభాష్‌రెడ్డి, మెంబర్ ఆశన్న, మంగళి సుదర్శన్, బాసరకు చెందిన రాందాస్, ముథోల్‌కు చెందిన త్రయంబకేశ్వర్ ఉన్నారు. 1990 అక్టోబర్‌లో మొదటి కరసేవ.. 1992 డిసెంబర్ 6వ తేదీన రెండో కరసేవగా పేర్కొంటారు. కరసేవలో పాల్గొన్న వారిని అప్పట్లో ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ సెంట్రల్ జైలులో పెట్టారు. వీరు 12 రోజులు జైలు జీవితం అనుభవించారు. ఈ సందర్భంగా కరసేవలో పాల్గొన్న వారు మాట్లాడారు. గత స్మృతులను మరిచిపోలేక పోతున్నామని తెలిపారు. సోమవారం అయోధ్య బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠను జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తమతో వచ్చిన వారిలో కొందరు మృతి చెందగా.. మిగతా వారందరూ మరొసారి అయోధ్యకు వెళ్లి దర్శనం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



పంజేషా చౌక్ వద్ద ఎస్పీ జానకీ షర్మిల

భైంసా, జనవరి 21 : పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. ఆదివారం భైంసా పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇరువర్గాల సభ్యులు కలిసిమెలిసి ఉండాలని, ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలోని పలు ఏరియాలను పరిశీలించారు. ఆమె వెంట ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, పట్టణ సీఐ రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

# గంగాజల సేకరణకు పయనం



గంగాజల సేకరణ కోసం పాదయాత్రగా వెళ్తున్న మెస్రం వంశీయులు



ఝరిని వస్త్రంలో పేడుతున్న మెస్రం ధర్ము



పూజలందుకున్న ఝరికి మొక్కుతున్న మెస్రం వంశీయులు



అల్లుళ్లు, ఆడబిడ్డలకు కానుకలు వేస్తూ..

### హస్తలమడుగుకు పాదయాత్రగా బయలుదేరిన మెస్రం వంశీయులు

- ఝరికి సంప్రదాయ పూజలు.. ఈనెల 28న పవిత్ర జలం సేకరణ
- ఫిబ్రవరి 9న అర్ధరాత్రి నాగోబాకు మహాపూజ

ఇంద్రవెల్లి, జనవరి 21 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో గల నాగోబా మహాపూజకు ఉపయోగించే గంగాజల సేకరణ కోసం హస్తలమడుగుకు మెస్రం వంశీయులు ఆదివారం బయలుదేరారు. ముందుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మెస్రం వంశీయులు మధ్యాహ్నం పురాతన నాగోబా ఆలయం(మురాడి)కు చేరుకున్నారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని మార్గాలపై చర్చించారు. అనంతరం మురాడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడే భద్రపర్చిన గంగాజల ఝరిని కటోడ కోసేరావ్, నాయికివాడి ధర్ము, కటోడ హనుమంత్‌రావ్ బయటకు తీశారు. ఆలయం పక్కన తెల్లవస్త్రంపై ఝరిని పెట్టి సంప్రదాయం ప్రకారం పురుషులు, మహిళలు వేర్వేరుగా పూజలు చేశారు. గంగాజలం తీసుకొచ్చే ఝరిని కటోడ కోసు వీపుపై తెల్ల వస్త్రంతో కట్టారు. గంగాజలం సేకరణ కోసం కాలినడకన వెళ్తున్న కటోడ కోసుతోపాటు 150 మంది మెస్రం వంశీయులు గిరిజన సంప్రదాయం ప్రకారం మర్యాద పూర్వకంగా ఒకరినొకరు కలుసుకున్నారు. గ్రామం నుంచి పొలిమేర వరకు గ్రామస్తులతోపాటు మెస్రం వంశీయులు వారిని సంప్రదాయం ప్రకారం సాగనంపారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, మెస్రం వంశీయులు చిన్ను పటేల్, బాజీరావ్ పటేల్, లింబారావ్, కటోడ కోసేరావ్, కటోడ హనుమంత్ రావ్, పర్ధాంజీ దాదారావ్, నాయికివాడి మెస్రం ధర్ము, పేన్ కోత్వాల్ మెస్రం తిరుపతి, గణపతి, మనోహర్, నాగోరావ్, జంగు పటేల్, సోనేరావ్, దేవ్‌రావ్, నాగ్‌నాథ్, తుకారాం, శేఖర్‌బాబు, జంగు బాపు, ఆనంద్‌రావ్, సీతారాం, కార్తీక్, మారుతి పాల్గొన్నారు.

#### పాదయాత్ర విశేషాలు..

- జనవరి 21న కేస్లాపూర్ నుంచి ఆదివారం సాయంత్రం ప్రారంభమైన గంగాజల సేకరణ పాదయాత్ర రాత్రికి కేస్లాగూడ(జీ) గ్రామానికి చేరుకొని, అక్కడే బస చేశారు.
- 22న నార్నూర్ మండలంలోని గుంజాల గ్రామానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.
- 23న నార్నూర్ మండలంలోని నాగల్‌కొండ
- 24న జైనూర్ మండలంలోని గౌరి
- 25న లింగాపూర్ మండలంలోని గుమ్నూర్
- 26న జన్నారం మండలంలోని ఇస్లాంపూర్
- 27న దస్తురాబాద్ మండలంలోని మల్లాపూర్
- 28న జన్నారం మండలంలోని గోదావరి నదికి ప్రత్యేక పూజలు చేసి, హస్తలమడుగులో గంగాజలం సేకరిస్తారు. అదేరోజు తిరుగు పయనమై ఉట్నూర్‌కు చేరుకుంటారు.
- 29న ఉట్నూర్ మండల కేంద్రంలో బస చేస్తారు.
- 30న ఇంద్రవెల్లి మండలంలోని దోడంద గ్రామానికి చేరుకుంటారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 1, 2, 3, 4 వరకు అక్కడే బస చేస్తారు.
- ఫిబ్రవరి 5న ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం కేస్లాపూర్ మర్రిచెట్ల వద్దకు చేరుకుంటారు. మూడు, నాలుగు రోజులు మర్రిచెట్ల నీడలోనే బస చేస్తారు.
- ఫిబ్రవరి 6న రాత్రి మెస్రం వంశీయుల పటేళ్లు మర్రిచెట్ల వద్దకు చేరుకోగానే వారికి ఘనంగా స్వాగతం పలుకుతారు.
- ఫిబ్రవరి 7న కర్మకాండా(తూమ్) పూజలు నిర్వహిస్తారు.
- ఫిబ్రవరి 8న ధర్మాన్ చేస్తూ విశ్రాంతి తీసుకుంటారు.
- ఫిబ్రవరి 9న నాగోబాకు గంగాజలంతో మహాపూజ నిర్వహిస్తారు.



గంగాజలం సేకరించే ఝరికి పూజలు చేస్తున్న మెస్రం మహిళలు



పాదయాత్రపై చర్చిస్తున్న మెస్రం వంశీయులు

# పకడ్బందీగా ఓటరు జాబితా

### ఆదిలాబాద్ జిల్లా ఓటర్లు 4,49,980 మంది

- కొత్త ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులకు అవకాశం
- రెండు రోజులు ప్రత్యేక కార్యక్రమాలు



ఆదిలాబాద్ రూరల్ మండలం అనుకుంటలోని పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్, జనవరి 21(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించడానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో అధికారులు ఓటరు జాబితా సవరణ 2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జనవరి 6వ తేదీన ఆదిలాబాద్ జిల్లా ముసాయిదా ఓటరు జాబితాను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్‌రాజ్ విడుదల చేశారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో కలిపి 4,49,980 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో పురుషులు 2,20,107, మహిళలు 2,29,865, ఇతరులు 12, సర్వీస్ ఓటర్లు 784 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళ ఓటర్లే 9,758 మంది అధికంగా ఉన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 2,41,616 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 1,18,666 మంది, మహిళలు 1,22,944, ఇతరులు ఆరుగురు, 12 మంది ఎన్ఆర్ఐ, 233 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. బోథ్ నియోజకవర్గంలో 2,09,364 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 1,01,441.. మహిళలు 1,06,921.. ఇతరులు ఇద్దరు, 551 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.

**నేటి వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం**

ముసాయిదా ఓటరు జాబితాను కలెక్టర్ కార్యాలయం, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కార్యాలయం, ఆయా పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉంచారు. నేటి (సోమవారం) వరకు జాబితాపై అభ్యంతరాల స్వీకరణతోపాటు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 2వ తేదీలోగా అభ్యంతరాలు, క్లెయిమ్స్ పూర్తిస్థాయిలో పరిష్కరించి 8వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించనున్నారు.

**రెండు రోజులు ప్రత్యేక కార్యక్రమాలు**

ఓటరు జాబితా కార్యక్రమం-2024 లో భాగంగా శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండి ఫారం-6 ద్వారా జనవరి 1, 2024 నాటికి 18 ఏండ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేశారు. ఫారం-7 ద్వారా మరణించిన వారి పేర్లు తొలగించడంతోపాటు రెండు చోట్ల ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారిని సరి చేస్తారు. ఫారం-8 ద్వారా ఓటరు కార్డులో తప్పు, ఒప్పుల సవరణలు, దివ్యాంగుల గుర్తింపు, మొబైల్ నంబరు నమోదు, కొత్త ఓటరు గుర్తింపు కార్డు, పోలింగ్ కేంద్రం మార్పు చేసుకునే అవకాశాలు కల్పించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. జాబితాను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశాలు ఉండడంతోపాటు మార్పులు-చేర్పులు చేసుకునే అవకాశాలున్నాయి.

# 'ఫొటో ఓటరు జాబితా సవరణ'ను పకడ్బందీగా నిర్వహించాలి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు భారతి లక్‌పతినాయక్
- మంచిర్యాలలో నాలుగు జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు భారతి లక్‌పతినాయక్

నస్పూర్/ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 21 : ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024ను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు బీ. భారతి లక్‌పతినాయక్ ఆదేశించారు. ఆదివారం నస్పూర్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, బదావత్ సంతోష్, రాహుల్‌రాజ్, ఆశీష్‌సంగ్వాన్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, రాహుల్, సభావత్ మోతీలాల్, ఫైజన్ అహ్మద్‌లతో కలిసి ఎన్నికల, రిటర్నింగ్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, సూపర్ వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి లక్‌పతినాయక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, దానిని సద్వినియోగం చేసుకోవాలంటే ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా 6,7,8 ఫారాల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, వయసు, అర్హత గల దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు తమ వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో ఓటర్ల ఫొటోలు స్పష్టంగా కనబడే విధంగా చూడాలని సూచించారు. ఫిబ్రవరి 2న ఫిర్యాదులను పరిష్కరించాలని, 6న పారామీటర్లు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం అనుమతి పొంది.. 8న తుది జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. నూతన ఓటరు నమోదు, జాబితా సవరణపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## పూసాయికి పోటెత్తిన భక్తజనం



భక్తులతో కిటకిటలాడుతున్న పూసాయి ఎల్లమ్మ ఆలయం

జైనథ్, జనవరి 21 : పూసాయి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లి జాతర పుష్యమాసంలో ప్రారంభం కాగా.. మాఘమాసం వరకు కొనసాగనున్నది. ఇందులో భాగంగా ఆదివారం ఎల్లమ్మ జాతర భక్తులతో కిటకిటలాడింది. తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పాడి పంటలతోపాటు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించారు. కోనేరులో స్నానం చేస్తే చర్మవ్యాధులు నయం అవుతాయని, ఈ నీళ్లను చేలలో చల్లితే చీడపీడలు తొలిగి పోతాయని భక్తుల విశ్వాసం. సర్పంచ్ పోతారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లను చేయగా.. ఎస్ఐ పురుషోత్తం ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

## జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, జనవరి 21 : నిరంతర సాధనతో క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని మాజీ మంత్రి జోగు రామన్న ఆకాంక్షించారు. ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ మైదానంలో నిర్వహిస్తున్న ఆదిలాబాద్ క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్ జాహ్నవి, ఏ లెవెన్ స్టార్ జట్ల మధ్య జరిగింది. ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో ఏ లెవెన్ స్టార్ జట్టు విజయం సాధించి టోర్నీని కైవసం చేసుకున్నది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేత జట్టుతోపాటు రన్నర్ జట్టుకు జోగు రామన్న బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు టోర్నమెంట్‌లు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటి జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సజిదొద్దీన్, నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద్, ప్రశాంత్ పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## కంది రైతులను ఆదుకునేందుకే కేంద్రాలు

- నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ టౌన్, జనవరి 21 : కంది రైతులను ఆదుకునేందుకే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రం క్వింటాలుకు రూ.9 వేల ధర ప్రకటించిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ, డీసీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎఫ్‌పీసీఎస్ చైర్మన్ రాజేందర్, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ పాల్గొన్నారు.

**ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్ ఆవిష్కరణ**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘంతోపాటు పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేంద్రబాబు, రమణరావు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నాయకులు రాజేశ్‌నాయక్, క్రాంతికుమార్, రవీందర్ పాల్గొన్నారు.



కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

## సమష్టి కృషితోనే ఫలితాలు సాధించాం..

- ఆదిలాబాద్ డీసీవో శ్రీనివాస్‌రెడ్డి

నిర్మల్ టౌన్, జనవరి 21 : జిల్లాలో సహకార సంఘాల అభ్యున్నతికి అందరి సహకారం ఉండడం వల్లనే మంచి ఫలితాలు వస్తున్నాయని డీసీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం డీసీవో కార్యాలయంలో పీఏసీఎస్ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. అన్ని సహకార సంఘాల్లో లక్ష్యం మేరకు రుణాలను వసూలు చేయాలని, కొత్త రుణాలను అందించాలని తెలిపారు. సహకార సంఘాల ద్వారా వాణిజ్య, వ్యాపార అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు రాజమల్లు, సంఘం అధ్యక్షుడు సాయారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

**డీసీవోకు పదోన్నతి...**

జిల్లా సహకార శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి పదోన్నతి లభించింది. హైదరాబాద్‌లోని హాకా జనరల్ మేనేజర్‌గా పదోన్నతి లభించడంతో ఆయనను ఉద్యోగులు సన్మానించారు.